## మత్తు పదార్థాలకు చిన్నారులు దూరంగా ఉండాలి

**రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య**

చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతున్న సందీప్ శాండిల్య

సైదాబాద్, జూన్ 18: మాదక ద్రవ్యాలకు చిన్నారులు, యువత దూరంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. సైదాబాద్‌లోని జువైనల్ బాలుర సదనాల్లోని చిన్నారులకు, డీ అడిక్షన్ సెంటర్‌కు వచ్చే యువతకు నిర్వహించిన డ్రగ్స్, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెడు స్నేహాలు వలన మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న యువత తమ భవిష్యత్తును తామే మోసం చేసుకుంటున్నారన్నారు. ఉజ్వల భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రతి ఒక్కరు వాటికి దూరంగా ఉంటూ మంచిగా చదువుకొని, తమ ఆసక్తి ఉన్న రంగల్లో రాణించాలన్నారు. బాలుర సదనాల్లో ఉన్న చిన్నారులంతా గతాన్ని మర్చిపోయి, కొత్త జీవితంలో తమకు ఇష్టమైన రంగాల్లో రాణించడానికి ఇక్కడి నుంచే శిక్షణ పొందాలన్నారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాలను తీసుకోవడం ద్వారా కలిగే అనర్థాలను వివరించి, చిన్నారులతో ముచ్చటించి వారికి క్రీడ పరికరాలు అందజేసి, చిన్నారులకు క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గమనించి వారితో ఆటలాడిస్తూ వారిని ప్రోత్సహిస్తూ, వారి చేత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, అధికారులు అభిషేక్ మహంతి, రూపేష్, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ, జువైనల్, కరెక్షనల్ సర్వీసెస్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. చార్వాక, అధికారులు నవీన్ కుమార్, అఫ్జల్, సంగమేశ్వర్, జ్వాలా, గోపి కుమార్, మాజీ డిప్యూటీ డైరెక్టర్ మీర్జా అలీ బేగ్, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, బాలుర సదనాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కందుకూరు, జూన్ 18 : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని మార్కెట్ చైర్మన్ సబావత్ కృష్ణా నాయక్, మండల పరిషత్ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నేదునూరు గ్రామనికి చెందిన బుడ్డీరపు శ్రీనివాస్‌కు రూ . 45 వేలు, ఎల్మటి నిర్మలకు రూ. 60 వేల రూపాయలను సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను బుధవారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, పేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మాజీ మండల కోఆర్డినేటర్ యండి అఫ్జల్ బేగ్, డైరెక్టర్ లు యాదయ్య, యుగంధర్ గౌడ్, విష్ణు వర్ధన్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సొడుపు వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ పాండు, మాజీ వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య అందించండి

**పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

మీర్ పేట్ సిర్లాహిల్స్ లో ఉన్న ప్రభుత్వ పాఠశాలను, జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైమైన విద్య అందించే విధంగా అధ్యాపకులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కళాశాలను, ప్రభుత్వ పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కూర్చొని అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలను ఆమె శ్రద్ధగా విన్నారు. ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. ఎలా చదువుతున్నారని విద్యార్థులను అడిగారు. కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని బాగా చదువుకోవాలన్నారు. విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలపై అధ్యాపాకులతో ఆమె చర్చించారు. ప్రభుత్వ పాఠశాలను గ్రేడ్ చేయించాలని ఎంఈఓ కృష్ణయ్యకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా ఏర్పాటుచేసిన భవనంలో 5, 6, 7, 8 తరగతులు నిర్వహించాలని ఆమె అధ్యాపకులకు తెలిపారు. ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు అధ్యాపకులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. విద్యాశాఖ అధికారులతో మాట్లాడి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడటానికి చొరవ తీసుకుంటానని ఆమె తెలిపారు. జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్లు లేరని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆమె విద్యాశాఖ అధికారులతో మాట్లాడి లెక్చరర్లను భర్తీ చేసే విధంగా చూస్తానని తెలిపారు. కళాశాలలో ఉన్న సమస్యలను తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మంచి ఫలితాలు వచ్చే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన సేవలు అందించేందుకు అధ్యాపకులు దృష్టి సారించవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు కాంతారావు, నాయకులు అరకల కామేష్ రెడ్డి, భూపాల్ రెడ్డి, సునీత బాలరాజ్, శ్రీను నాయక్, మర్రి నర్సిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### అండగా నిలుస్తాను.. సబిత

సబితా ఇంద్రారెడ్డితో విద్యార్థి, తల్లిదండ్రులు

పహాడి షరీఫ్, జూన్ 18: ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించడానికి అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి ఓ విద్యార్థికి భరోసా అందించారు. శ్రీరామ్ నగర్‌లోని సబితా ఇంద్రారెడ్డి నివాసంలో బుధవారం ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సర విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు కలిశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ విద్యాభ్యాసం కొనసాగిస్తూ జీవితం లో ఉన్నత స్థానంలో నిలవాలని అభిలాషించారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

దెబ్బడగూడ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ

కందుకూరు, జూన్ 18 : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 7న ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లెపల్లి కృష్ణ మాదిగ అన్నారు. మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా ఉండాలని కోరారు. అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావి చెట్టు వెంకటయ్య, ఉపాధ్యక్షులు మల్లెపల్లి బాలరాజ్, మల్లేపల్లి రాజు, కమిటీ సభ్యులుగా మల్లపల్లి ప్రభుదాసు, మల్లెపల్లి ప్రభాకర్, మల్లేపల్లి సామయ్య, మల్లెపల్లి బాలరాజ్, పడకంటి నరసింహ, గూడెం శీను, వంక శీను, రావిచెట్టు శీను, రవీందర్, రాజేందర్, భారత్, శరత్, జోసఫ్, రమేష్ నియమితులయ్యారు.

## 16న జరిగే పీజీ డిప్లామా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ పరీక్ష వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వచ్చే నెల 16న నిర్వహించనున్న అడ్వాన్స్ పీజీ డిప్లామా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ మొదటి సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను తిరిగి వచ్చే నెల 18వ తేదీన నిర్వహించనున్నామన్నారు. పరీక్షా కేంద్రం సమయంలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతల వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

### బీ ఫార్మసీ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, ఏడు, ఎనిమిదో సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షలను వచ్చే నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

**- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

వనస్థలిపురం, జూన్ 18: నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ వివేకానంద కాలనీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను కలిశారు. కాలనీలో ఉన్న సమస్యలు వివరించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజా ధనం వృథా కాకుండా, నాణ్యతా ప్రమాణాలతో పనులు నిర్వహిస్తున్నామని, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

## శ్రీనివాస కాలనీ కమిటీ నూతన హాల్ ప్రారంభం

కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి

హయత్ నగర్, జూన్ 18 : హయత్‌నగర్ డివిజన్‌లోని శ్రీనివాస కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి బుధవారం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీ వాసులందరూ వివిధ ప్రాంతాలకు చెందిన వారైనా ఒకేచోట స్థిరపడి కలిసి కట్టుగా నివాసముంటూ కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడం అభినందనీయమని కొనియాడారు. కమ్యూనిటీ హాల్ భవన నిర్మానానికి స్థల దాతలు పిషాటి శ్రీకాంత్ రెడ్డి, అలగర స్వామి రాజేంద్రన్, నిర్మాణ దాతలైన కుంచారం బాల్ రెడ్డి, కుమారులు వెంకట్ రెడ్డి, జైపాల్ రెడ్డిను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు మాణిక్ రెడ్డి, జైపాల్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కృష్ణ, ధర్మా రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ బ్రహ్మ మురారి

మలక్ పేట జూన్ 18: చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్లో పలువురు రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. చాదర్ ఘాట్ సీఐ బ్రహ్మ మురారి ఆదేశాల మేరకు ఎస్సై భరత్ కుమార్ పీఎస్ పరిధిలోని పలువురు రౌడీ షీటర్లు అమన్ లాలా, కాలా ఇమ్రాన్, సంతోష్, యాభ తదితరులను స్టేషన్‌కు పిలిపించగా, గతంలో వారు పాల్పడిన సంఘ విద్రోహక సంఘటనలు, నేర కార్యకలాపాలను దృష్టిలో పెట్టుకొని, ముమ్ముందు మళ్లీ వారు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, ఎలాంటి గొడవలు, అల్లర్లలో తల దూర్చకుండా, బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడకుండా ఇన్ స్పెక్టర్ వారికి తగిన సూచనలు చేశారు. ఎలాంటి సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడినా పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపించనున్నట్లు సీఐ వారిని హెచ్చరించారు.

## పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

**మేడ్చల్, జూన్ 18 :** మేడ్చల్ డిపో నుంచి పలు పుణ్యక్షేత్రాలకు విహార యాత్రలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయా డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. ఈనెల 27న ఉదయం 5:00గంటల మేడ్చల్ నుంచి బ యల్దేరి కాళేశ్వరం 11:00/13:30 అక్కడి నుంచి రామప్ప ఆలయం 15:30/16:30 వరంగల్ భద్రకాళి ఆలయం 18:15/19: 00 తదుపరి వేయి స్తంభాల ఆలయం 19:00/19:50 చివరికి మేడ్చల్ కు 22:10 వస్తుంది అని చెప్పారు. పెద్దలకు రూ.1200, పిల్లలకు రూ.700, మరిన్ని వివరాలకు 9849737131కు సంప్రదించాలని కోరా రు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్ అసిస్టెంట్ మేనేజర్ రామారావు ఉన్నారు.

**చెంగిచెర్ల డిపో నుంచి..**

**కాప్రా/బోడుప్పల్:** ఆలయాల దివ్యదర్శనాలు కల్పించేందుకు ఆర్టీసీ ప్రవేశపెట్టిన ప్రత్యేక టూర్ ప్యాకేజీని భక్తులు వినియోగించుకోవాలని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్,కుషాయిగూడ డిపో మేనేజర్ మహేష్‌కుమార్ కే.కవిత సూచించారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో బుధవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 27న చెంగిచెర్ల డిపో నుంచి ఉప్పల్ చౌరస్తా మీదుగా ముచ్చింతల్‌లోని శ్రీ అనంతపద్మనాభ స్వామి ఈలయం, కొత్తూర్ మీదుగా షాద్‌నగర్‌లోని రామలింగేశ్వర స్వా మి ఆలయం, అమ్ముపల్లిలోని శ్రీ సీతారామస్వామి ఆలయం, వెండికొండలోని వెండికొండ సిద్దేశ్వర స్వామి ఆలయాల దివ్యదర్శనాల నిమి త్తం ప్రత్యేక ప్యాకేజ్ టూర్ బస్సులు నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. 40 మంది ప్రయాణికు లు కలిగి ఉంటే వారి కాలనీ వద్ద నుంచి ఆలయ దర్శనాలకు తీసుకువెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. ఈ ప్యాకేజీలో పెద్దలకు రూ. 600, పిల్లలకు రూ. 300 ఉంటుందన్నారు. ఉదయం 5 గంటలకు ఈసీఐఎల్ బస్‌స్టేషన్ నుంచి బయలు దేరి ఎంజీబీఎస్ మీదుగా వికారాబాద్ వెళ్తుందనీ, తిరుగు ప్రయాణంలో రాత్రి 8 గంటలకు ఈసీఐఎల్ చేరుతుందని తెలిపారు.ఈసీఐఎల్ పరిసర ప్రాం తాల ప్రజలు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కుషాయిగూడ డీపో మేనేజర్ విజ్ఞప్తి చేశారు.

## అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి

మీర్‌ఖాన్‌పేట్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శాంతిశ్రీ

కందుకూరు, జూన్ 18 : అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శాంతిశ్రీ తెలిపారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్ పేట్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'అంగన్‌వాడీ బడిబాట' కార్యక్రమం నిర్వహించారు. 2025 –26 విద్యా సంవత్సరానికి గాను అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను ఆహ్వానించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, చిన్నపిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. డయేరియ, తదితర వ్యాధులు ప్రబలకుండా దోమలు, ఈగలు. రాకుండా చూసుకోవాలని కోరారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. విద్యార్థులును ప్రాథమిక విద్యా సర్టిఫికెట్ అందజేశారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలలో జరుగుతున విద్యా బోధన విధానం, ప్రీస్కూల్ టైమ్ టేబుల్, సిలబస్, కార్టన్స్, అసెస్మెంట్ కార్డ్స్ , ప్రీస్కూల్ కిట్ గురించి వివరించారు. ప్రీ స్కూల్ ద్వారా పిల్లల్లో శారీరక, మేధో, మానసిక, భాష, పూర్వ లిఖిత, పూర్వ పఠన అభివృద్ధి గురించి వివరించారు. మూడు సంవత్సరాలు నిండిన బాల బాలికలను అమ్మ బాట, అంగన్‌వాడీ బాట కేంద్రానికి పంపించాలని కోరారు. అనంతరం అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కిచెన్ గార్డెన్ లో ఆకుకూరలు, కూరగాయ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సబిత, టీచర్లు పద్మ, సునీత, ఆయాలు, ఎఎల్ ఎంసీ కమిటీ సభ్యులు, తల్లులు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా 'మీ సేవ'లు నడిపిస్తే చట్టపరమైన చర్యలు

**తహసీల్దార్ ఇందిరాదేవి**

బడంగ్ పేట్, జూన్ 18: 'మీ సేవ' కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని చాలామంది బాధితుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి అన్నారు. బాలాపూర్ మండలంలో ఉన్న 'మీ సేవ' ఆపరేటర్లతో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 'మీ సేవ' ఒకరి పేరుతో తీసుకొని మరొకరు నడిపిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని తహసీల్దార్ తెలిపారు. చార్ట్ ప్రకారమే దరఖాస్తుదారుల నుంచి డబ్బులు తీసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమించి అడ్డగోలుగా డబ్బులు తీసుకుంటే చర్యలు తప్పవన్నారు. 'మీ సేవ' కేంద్రాలకు వస్తున్న కస్టమర్లతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. దురుసుగా మాట్లాడితే చర్యలు తీసుకుంటామన్నారు. సర్టిఫికెట్లు ఇప్పిస్తామని పైరవీలు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే చాలామంది ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఆపరేటర్ల పై ఫిర్యాదులు వస్తే ఆ కేంద్రాన్ని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారమే డబ్బులు తీసుకోవాలన్నారు. మరోసారి ఫిర్యాదులు వస్తే ఇక నుంచి చెప్పేది ఉండదన్నారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్ రెడ్డి, 'మీ సేవ' ఆపరేటర్లు, తదితరులు ఉన్నారు

## మధుమేహ నివారణకు బరువు తగ్గడమే ఏకైక మార్గం

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్‌రెడ్డి, డాక్టర్ భవాని

మన్సూరాబాద్, జూన్ 18: గర్భం దాల్చినప్పుడు మహిళలకు వచ్చే మధుమేహం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఎల్బీనగర్ కామినేని దవాఖాన వైద్యులు డాక్టర్ సందీప్‌రెడ్డి, డాక్టర్ భవానీ తెలిపారు. మధుమేహ అవగాహన వారాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్ కామినేని దవాఖాన ప్రాంగణంలోని ఇందిరా ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, గర్భం దాల్చిపుడు వచ్చే మధుమేహం రెండు నుంచి ఐదు సంవత్సరాల వరకు కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. నలభై సంవత్సరాల లోపు వారికి మధుమేహం వచ్చిందంటే అది టైప్ 1 లేదా టైప్ 2 కావచ్చునని, లేక జన్యుపరంగా, హార్మోన్ల సమస్య వలన రావచ్చునని పేర్కొన్నారు. ఆహారపు అలవాట్లు మార్చుకోవడం, జీవనశైలి అలవాట్లు మెరుగుపరుచుకోవడం, తగినంత వ్యాయామం చేయడం, ఊబకాయాన్ని అదుపులో ఉంచుకోవడం లాంటి మార్గాల ద్వారానే గర్భంతో వచ్చే మధుమేహం భవిష్యత్తులో కొనసాగకుండా నియంత్రించుకోవచ్చునని తెలిపారు. పురుషుల్లో 40 సంవత్సరాల లోపు వారికి టైప్2 మధుమేహం వస్తుందని.. 20 సంవత్సరాల లోపు వచ్చే వారికి మధుమేహం తీవ్రత ఎక్కువగా ఉంటుందని.. హెచ్‌బీఏ1సీ 12, 13 ఉంటుందన్నారు. దీన్ని నియంత్రించడానికి స్వల్పకాలం పాటు ఇన్సులిన్ వాడాల్సి వస్తుందన్నారు. జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం వలన 50 సంవత్సరాల అనంతరం రావల్సిన మధుమేహం 20 సంవత్సరాల వయస్సులోనే వస్తుందన్నారు. మద్యపానం, ధూమపాన వల్ల సైతం మధుమేహం వచ్చే అవకాశం ఉందన్నారు. రోజు వారి జీవనశైలిని మార్చుకోవడం, బరువు తగ్గడం వలన మధుమేహాన్ని నియంత్రించుకోవచ్చునని పేర్కొన్నారు. మధుమేహ నియంత్రణ కోసం బరువు తగ్గడానికి ప్రస్తుతం కొన్ని ఇంజక్షన్లు, మాత్రలు అందుబాటులోకి వచ్చాయని, వీటి వాడకం వలన 10 నుంచి 15 కిలోల బరువు తగ్గవచ్చునని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మధుమేహ నివారణకు బరువు తగ్గడమే ఏకైక మార్గమని సూచించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కే పురం, జూన్ 18: గణేష్ పురి, వి గార్డ్, నరసింహపురి, హనుమాన్ నగర్, శివాలయం, యాదవ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ అర్షత అలీ తెలిపారు. పురి ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామాలయం, ఇంద్రానగర్, గణేష్ పురి, న్యూ దిల్‌సుఖ్‌నగర్, ద్వారకాపురి పరిసర ప్రాంతాలు. వి గార్డ్ ఫీడర్ పరిధిలో వాంబే కాలనీ, మన్సూరాబాద్, విశాలాంధ్ర, రాక్ టౌన్, బిగ్ బజార్ వెనుక ప్రాంతం, బాలాజీ నగర్ పరిసర ప్రాంతాలు. నరసింహపురి కాలనీ ఫీడర్ పరిధిలో నరసింహపురి కాలనీ, హుడా కాలనీ, డాక్టర్స్ కాలనీ రోడ్ నెంబర్ 2 టు 4 పరిసర ప్రాంతాలు. హనుమాన్ నగర్ ఫీడర్ పరిధిలో హనుమాన్ నగర్, విద్యుత్ నగర్, వికాస్ నగర్ పరిసర ప్రాంతాలు. శివాలయం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు సెంట్రల్ బ్యాంక్ కాలనీ, సూర్యోదయ కాలనీ, భవాని నగర్, హిమపురి కాలనీ, బాల్‌రెడ్డి నగర్ పరిసర ప్రాంతాలు. యాదవ నగర్ ఫీడర్ పరిధిలో అల్కాపురి, యాదవ నగర్, హరిపురి కాలనీ పరిసర ప్రాంతాలు.

# కొత్తగూడలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఏర్పాటు చేయాలి

**- శిథిలావస్థకు చేరిన బీసీ కమ్యూనిటీ హాల్**
**- అవస్థలు పడుతున్న విద్యార్థులు**

శిథిలావస్థకు చేరిన బీసీ కమిటీ హాల్

కందుకూరు , జూన్ 18: మండల పరిధిలోని కొత్తగూడ గ్రామంలో అంగన్‌వాడీ సొంత భవనం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్వహించిన బీసీ కమ్యూనిటీ హాల్ రేకుల షెడ్డులో ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుంది. నూతన భవనం నిర్మించడానికి ప్రజాప్రతినిధులు కానీ అధికారులు కానీ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడీడు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని గొప్పలు చెప్పడమే కానీ సొంత భవనం నిర్మించడానికి ఎవరు ముందుకు రావడం లేదని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్మించడానికి మాజీ మంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి శిలాఫలకం వేసి నిధులను సైతం మంజూరు చేశారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అంగన్‌వాడీ టీచర్ సరస్వతి పలు మార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం మాత్రం కనిపించడం లేదు. విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలం కరువైంది. కనీసం మధ్యాహ్న భోజనం, గుడ్లు వండి పెట్టడానికి గది లేదు. పక్కనే ఉన్న పాత గ్రామపంచాయతీ గదిని వాడుకుంటున్నారు. సమావేశం ఏర్పాటు చేద్దాం అన్న ఒకటే గది ఉంది. మండల కేంద్రానికి సమీపంలో ఉన్నా సొంత భవనంతో పాటు స్థలం లేకపోవడంతో అంగన్‌వాడీ సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ 'బడిబాట' కార్యక్రమం జరుగుతున్నా సంబంధిత అధికారులు ఇటువైపు చూడడం లేదు. ఇతర గ్రామాల్లో అంగన